క్లుప్తంగా

మహానేత వైఎస్సార్ జయంతి వేడుకకు హాజరుకండి

మండపేట: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకను విజయవాడ సమీపంలోని మంగళగిరి వద్ద డీజీపీ కార్యాలయం సమీపంలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. ఆదివారం మండపేట కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జయంతి వేడుకల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొడవళ్ల వెంకటసుబ్బారావు, ముగ్గుళ్ల శ్రీను, పిల్లి అప్పన్న, కుచ్చు బాబి, వల్లబదాసు చిన్న, వి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో గ్రావెల్ రోడ్డు వేయిస్తా

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెం జగనన్న కాలనీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పర్యటించారు. మహిళలు, స్థానిక కూటమి నాయకులు కాలనీలో రోడ్లు పరిస్థితి దారుణంగా ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లు బురదమయంగా ఉండటంతో మంత్రి సుభాష్ స్పందిస్తూ వచ్చే బుధవారం లోపుగా గ్రావెల్ రోడ్డుకి గ్రాంట్ వచ్చేలా చూసి రోడ్డు వేయిస్తానని ప్రభుత్వ నిధులు మంజూరు కాని పక్షంలో తన సొంత ఖర్చులతో రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. స్థానికులు మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో ఈ నెల 4న అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి నేలకూల్చిన సంఘటనకు పాల్పడిన దుండగులను తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని తెలుగుదేశం నాయకులు ఆకుమర్తి చిన్నమాదిగ డిమాండ్ చేశారు. సంఘటనా స్థలాన్ని ఆదివారం పరిశీలించి స్థానికులతోను, పోలీసులతోను ఆయన మాట్లాడారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడకుండా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో ప్రభుత్వ సహకారంతో ఇదే చోటులో పూలే, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ నిలువెత్తు విగ్రహాలను నెలకొల్పుతామని ప్రకటించారు.

మండపేటలో..

మండపేట: రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ జిల్లా ఎస్పీని కోరారు. ఆదివారం వెల్ల గ్రామాన్ని ఆయన సందర్శించి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అంబేడ్కర్ విగ్రహాన్ని 24 గంటల్లో ప్రతిష్టిస్తామని విగ్రహానికి రక్షణ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందని సంజయ్ అన్నారు.

ప్రైవేటు యాజమాన్యాల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సుభాష్‌ను కలసిన ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు

రామచంద్రపురం: ప్రైవేటు స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రామచంద్రపురం జోనల్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలసి విన్నవించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొడ్డా సత్తిబాబు, గౌరవాధ్యక్షుడు మోడరన్ జీవీ రావు, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రగతి రాంబాబు, పట్టణ అధ్యక్షుడు సన్‌షైన్ సురేష్, గురుదేవ్ గిరీష్‌ప్రభు, సెయింట్ ఆన్‌గ్లోరియా శ్రీకాంత్, పామర్రు బాబు, ద్రాక్షారామ విజయ్‌కుమార్, వైష్ణవి మల్లికార్జున తదితరులు మంత్రి సుభాష్‌ను కలసి తమ సమస్యలను వివరించారు. అనంతరం మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీరావు మంత్రి సుభాష్‌ను ప్రజాహిత పురస్కారంతో సత్కరించారు.

మల్టీపర్పస్ యాక్టివిటీ సెంటర్‌కు భూమిపూజ

రాయవరం: వెంటూరులో రూ.20లక్షలతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఏక్టివిటీ సెంటర్‌కు రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆదివారం భూమిపూజ చేశారు. ఎంపీ బోస్‌తో పాటుగా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. భూమిపూజ కార్యక్రమం అనంతరం బోస్, జోగేశ్వరరావు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకరటమణ, మాజీ సర్పంచ్‌లు రిమ్మలపూడి వేణుగోపాలదొర, స్థానిక నేతలు దేవళ్ల వెంకట్రావు, చిరట్ల సుబ్బారావు, కొప్పిశెట్టి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా వైఎస్సార్

- ప్రజలకు పథకాలు అందించి.. వారి గుండెల్లో నిలిచిన దేవుడు
- ఏళ్ళు గడుస్తున్నా ఆయన సేవలను మరువని జనం
- నేడు వైఎస్సార్ 75వ జయంతి



పడమర ఖండ్రికలో ఇందిరమ్మ ఇళ్ల పథకం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్(ఫైల్)



కపిలేశ్వరపురం మండల పర్యటనకు వచ్చినప్పుడు ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ (ఫైల్)

కపిలేశ్వరపురం: కాలంతోపాటు నడిచేవాడు నేర్పరి. జీవితకాలాన్ని మానవాళి మేలు కోసం కృషి చేసేవాడు కారణ జన్ముడవుతాడు. అలాంటి మహనీయుడు కాలంలో కలిగిపోడు. కలకాలం ప్రజల గుండెల్లో వికసిస్తుంటాడు. అలాంటి మహనీయుల్లో పేదల డాక్టర్, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఒకరు. నమస్తే చెల్లెమ్మా, నమస్తే తమ్ముడూ అంటూ పలకరించిన ఆ చిరునవ్వు నేటికీ ప్రజాక్షేత్రంలో పదిలంగా ఉంది. ప్రజా పాలనకు మచ్చుతునకగా వెలుగొందిన వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా ఈ కథనం..

సంక్షేమానికి పునాదిరాయి పడమర ఖండ్రికలోనే..

వైఎస్సార్ పాలనా కాలంలో ఇందిరమ్మ పథకం పేదల సంక్షేమానికి గుండె వంటిది. ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రికలో 2006 ఏప్రిల్ ఒకటిన స్వయంగా వైఎస్సార్ ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆయన చేతుల మీదుగా పథకం తాలూకు శిలా ఫలకాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పేదల లబ్ధిదారుకు పింఛను అందజేశారు. ఆ సందర్భంగా అంగర పడమర ఖండ్రిక గ్రామాల్లో పర్యటించారు. ఆయనను చూసిన ప్రజలు దేవునిగా కొలిచిన తీరు 15 ఏళ్లుగా మదిలో పదిలంగా ఉంచారు. ఆ జ్ఞాపకాలను ఆయన జయంతి సందర్భంగా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. 1991లో పసలపూడిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని వైఎస్సార్ ఆవిష్కరించారు. 1996లో ఎంపీ హోదాలో మండపేట, ఏడిదలో పర్యటించారు. 2003 నవంబర్‌లో బస్సు యాత్ర సందర్భంగానూ, 2004లో ఎన్నికల ప్రచారంలోనూ మండపేటలో పర్యటించారు. 2009 జనవరి 3న ద్వారపూడిలో రైల్వేఫ్లైఓవర్ పనులకు శంకుస్థాపన చేశారు. చివరిసారిగా 2009 ఫిబ్రవరి 27న మండపేటలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. వైఎస్ హయాంలో మండపేట నియోజకవర్గంలో సుమారు రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. సుమారు 13,858 మంది పేదలకు ఇళ్ల నిర్మాణ రుణాలు మంజూరయ్యాయి. 4,992గా ఉన్న పింఛనుదారుల సంఖ్యను 18,428కి పెంచారు. 2,910 మందికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.8.4 కోట్ల విలువైన వైద్య సేవలను అందించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, పావలా వడ్డీ రుణాలు మంజూరు, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలకు చిరునామాగా వైఎస్సార్ జీవితం చిరస్థాయిగా నిలుస్తుంది.

మరో అడుగు ముందుకు..

పేదలందరికీ నివాసయోగ్యం కల్పించాలన్నది వైఎస్సార్ లక్ష్యం. అదే బాటలో మరో అడుగు ముందుకు వేసిన రాజన్న బిడ్డ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అదే సంక్షేమం కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు మాత్రమే కాదు ఊర్లను నిర్మించిన ఘనత వైఎస్ జగన్‌కి దక్కుతుంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో పేదలకు నివాసయోగ్యం కలిగించింది. నాడు వ్యవసాయ సాగుకు ఉచిత విద్యుత్ ఇచ్చి వ్యవసాయ రంగం అభివృద్ధికి బాట వేశారు వైఎస్సార్. గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలను స్థాపించి రైతు పక్షాన నిలిచారు వైఎస్ జగన్. ఇలా అన్ని రంగాల్లో తనదైన శైలిలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తండ్రిబాటలో పయనిస్తూ ప్రజల మనిషిగా నిలిచారు.

మా ఇంటికి శంకుస్థాపన చేశారు



ఇందిరమ్మ పథకంలో భాగంగా మాకు సొంతింట కల సాకారమైంది. 2006 ఏప్రిల్ ఒకటిన మా ఇంటి నిర్మాణ పనులకు వైఎస్సార్ చేతుల మీదుగా కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మాకు నీడనిచ్చిన దేవుడు వైఎస్సార్. కోట్లాది మందికి మేలు చేసిన మహనీయుడు ఆయన.

– నేల సౌదామణి, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం మండలం.

రైతు బాంధవుడు



వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వ్యవసాయం పండగలా సాగింది. రుణాల మంజూరు, ఉచిత విద్యుత్, గిట్టుబాటు ధర అందించడంతో రైతు సంతోషంగా గడిపాడు. అందుకే రైతుల పాలిట దేవుడుగా వైఎస్సార్‌ను జనం ఆరాధిస్తున్నారు.

– పిల్లా వీరబాబు, పాలతోడు, మండపేట మండలం

వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



అన్నాయిపేటలో రంగా విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ రాంబాబు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేట కాపు కళ్యాణ మండపం ఆవరణలో దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటుకు ద్రాక్షారామకు చెందిన అమృత వర్ష హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఎం.రాంబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సెప్టెంబరు 2న ప్రారంభించే విధంగా విగ్రహం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, రాధారంగా మిత్ర మండలి సభ్యులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన భౌతిక శాస్త్ర పాఠ్య పుస్తకంపై వర్క్‌షాపు

రామచంద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నూతన భౌతిక శాస్త్ర పాఠ్యపుస్తకాలపై ఉపాధ్యాయులకు పట్టణంలోని రేవతి సైన్స్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం వర్క్‌షాపులు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులు ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యం పెంపొందించడానికి ఎంతగానో దోహదం చేస్తాయని భారతీయ సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి అన్నారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి 50 మంది ఉపాధ్యాయులు ఈ వర్క్‌షాప్‌ల్లో పాల్గొన్నారు. రసాయన చర్యలు, సమీకరణాలు, ఆమ్లాలు, క్షారాలు, లవణాలు, లోహాలు, అలోహాలు, కర్బన సమ్మేళనాలు, కాంతి, విద్యుత్తు, అయస్కాంతతత్వం తదితర అంశాలపై ప్రయోగాలను ఉపాధ్యాయులతో చేయించారు. కార్యక్రమంలో రేవతి సైన్స్ ఫౌండేషన్ కార్యదర్శి బి.శ్రీనివాస్, జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు బీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల సంక్షేమానికి కృషి

మండపేట: జిల్లాలో రైస్‌మిల్లర్ల సంక్షేమానికి కృషి చేస్తానని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విజయలక్ష్మి నగర్‌లోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో వేగుళ్ల అభినందన సభ నిర్వహించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య అధ్యక్షతన జరిగిన అభినందన సభలో కోనసీమ జిల్లా నలుమూలల నుంచి రైస్ మిల్లర్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఎమ్మెల్యే వేగుళ్లను వారంతా సత్కరించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వేగుళ్ళ మాధవిబాబు, పట్టాభిలు ఆయనను దుశ్శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేశారు. సభలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలో రైస్‌మిల్లు పరిశ్రమ ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

- వాడీవేడిగా కాజులూరు మండల సమావేశం
- అధికారుల తీరుపై ఎంపీ బోస్ ఆగ్రహం



కాజులూరు మండల సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ ఎంపీ బోస్

కాజులూరు: గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో వ్యవహరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఆదివారం కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీ బోస్ ముఖ్య అతిథిగా హాజరై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. మండలంలోని 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు పలువురు అధికారులు అసంపూర్తిగా సమాధానాలు చెప్పడంపై ఎంపీ బోస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా జగన్నాథగిరి ఎంపీటీసీ కొప్పన లక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామంలో గృహనిర్మాణాలు ఎన్ని మంజూరయ్యాయి. నిర్మాణాలు ఎక్కడ ఏఏ స్థాయిలో ఉన్నాయో తెలియడం లేదని ఈ విషయంపై గతంలో మూడుసార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన లేదన్నారు. మండల గ్రామాల్లోహౌసింగ్ బిల్లులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని దీనిపై అధికారులు సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు ఫిర్యాదు చేశారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసరరావు మాట్లాడుతూ ఎంపీటీసీల నుంచి తనకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు. గృహనిర్మాణాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మండలంలో గృహనిర్మాణ స్థలాలు ఎక్కడెక్కడ ఎంతెంత కొనుగోలు చేశారు. ఎంతమందికి స్థలాలు ఇచ్చారు. ఎంతమందికి ఇవ్వాలని ఎంపీ బోస్ ప్రశ్నించగా డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్ సమాధానం చెప్పలేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు ఎటూ సమాచారం ఇవ్వడం లేదని కనీసం సర్వసభ్య సమావేశానికైనా పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలలకే విద్యార్థులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని సభ్యులు ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను పేరెంట్స్‌కు వివరించి వారిని చైతన్య పరచాలన్నారు. డ్వాక్రా సంఘాల స్త్రీ నిధి విషయంలో తీవ్ర అవకతవకలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని దీనిపై అధికారులు ఆడిట్ నిర్వహించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలన్నారు. జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రేఖాడి విజయ, పెదిరెడ్డి వెంకటరమణ, ఎంపీడీఓ సి.నాగేశ్వరశర్మ, ఎలక్ట్రికల్ ఏఈ సూర్యనారాయణ, ఏఓ అశోక్, ఏపీఓ వెంకటలక్ష్మి, ఎంపీఎం అనిల్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

10 నుంచి శ్రీరామ నామ సప్తాహం



ద్రాక్షారామలో శ్రీరామ నామ సప్తాహం కార్యక్రమానికి సిద్ధమైన వేదిక

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద నెల 10 నుంచి 17 వరకు శ్రీరామ నామ సప్తమ సప్తాహం నిర్వహించనున్నట్లు ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం సభ్యులు ఆదివారం విలేకరులకు తెలిపారు. 49 రోజుల పాటు నిర్వహించాలని తలపెట్టిన ఈ మహత్కర కార్యక్రమం ఈ ఏడాది సప్తమ సప్తాహంతో 49 రోజులు పూర్తవుతుందన్నారు. 10న ఉదయం 4.47 గంటలకు రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొంటారన్నారు. ఈ ఏడాది అమలాపురానికి మట్టపర్తి చంద్రశేఖర్ భజన బృందం, చిరుతపూడికి చెందిన నేషనల్ అవార్డు గ్రహీత రాజేష్‌స్వామి భజన బృందం, రాజమహేంద్రవరం, దంగేరుకు చెందిన లలితాపరమేశ్వరి మహిళా బృందం, విశాఖపట్నం స్టీలు ప్లాంట్‌కు చెందిన శ్రీపాన రమేష్‌బాబు భజన బృందం, అదే విధంగా ప్రత్యేక ఆహ్వానితులుగా గంగవరానికి చెందిన మేడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలోని బృందావనవిహారి మహిళా సమాజం, వెంటూరు, అంగరలకు చెందిన వాసంశెట్టి సిస్టర్స్ భజన బృందం, గంగవరానికి చెందిన శ్రీరామ భక్తాంజనేయ బాలభక్త సమాజం, కాండ్రేగులకు చెందిన కుడుపూడి సత్యనారాయణ, శ్రీవిజయదుర్గా మహిళా భజన బృందం, ద్రాక్షారామకు చెందిన కై రం వీరవెంకటసత్యనారాయణ(సతార్‌స్వామి) ఆధ్వర్యంలోని అయ్యప్ప భక్తి రంజని బృందం, పెద్దాడకు చెందిన శ్రీ సీతారామ భజన మండలి, ద్రాక్షారామ చెందిన అక్కిరెడ్డి లక్ష్మణరావు(అబ్బు), తమ్మా సాంబమూర్తి ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజంలు పాల్గొని భక్తి గీతాలతో ఓలలాడించనున్నారు. అదే విధంగా 16న రామచంద్రపురంకు చెందిన అక్కిరాజు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు హనుమాన్ చాలీసా పారాయణ, రోజూ రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున ఉదయం 3 గంటల వరకు తోటపేటకు చెందిన ముద్రగడ సత్యమూర్తి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ గణపతి భజన సమాజంచే భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17న దాతలు మంచెం ఆంజనేయమూర్తి(చిన బాబు), వెంకట సత్యరమ దంపతుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణం, అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


రామచంద్రపురం రూరల్: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం మండలంలోని ద్రాక్షారామ మార్కెట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, కాన్షీరాంల విగ్రహాల వద్ద ఆదివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ సిర్రా సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పుట్టిన రోజు, ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి పంచారు. సిర్రా సురేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ మాదిగలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అదే విధంగా మంద కృష్ణమాదిగ చిన్న పిల్లల గుండె శస్త్ర చికిత్సలు, దివ్యాంగుల పింఛన్ల పెంపు తదితర అంశాల్లో కృషి చేసి విజయం సాధించారన్నారు. మాదిగల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాజులూరు మండల కన్వీనర్ ఖండవల్లి శ్రీనివాసరావు, బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి పలివెల రాజు, నాయకులు లంక సత్యం, దార్ల జాన్‌బాబు, చంద్రమల్ల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం చరిత్రాత్మకం

మండపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి నేటికి 30 సంవత్సరాలు పూర్తయిందని ఈ వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సమీపంలో జరిగిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసి 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రాయవరంలో ఆదివారం ఘనంగా వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సభ్యులు లంక చందు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా లంక చందు, ఎమ్మార్పీఎస్ నేతలు చంద్రమళ్ల సంజయ్‌రాజు, దువ్వా చంద్రశేఖర్, చంద్రమళ్ల సునీల్, చంద్రమళ్ల రాజు తదితరులు మాట్లాడారు. ఈ ఉద్యమం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నేటికీ సాగుతుందన్నారు.

పీఎంపీలకు వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు



ద్రాక్షారామలో వైద్య బృందాన్ని సత్కరిస్తున్న పీఎంపీలు

రామచంద్రపురం రూరల్: కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది.పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రామచంద్రపురం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాల పీఎంపీలకు నూతన వైద్య విధానాలపై అవగాహన కార్యక్రమం ద్రాక్షారామ మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించారు. కాకినాడకు చెందిన రాఘవ ఎమర్జెన్సీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నెక్కంటి నగేష్‌బాబు, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నెక్కంటి రాఘవ చౌదరి, డాక్టర్ నెక్కంటి జానకి, డాక్టర్ తోట కావ్య, డాక్టర్ వల్లూరి లోకేష్‌లు హాజరై గుండె సంబంధిత వ్యాధులను సకాలంలో ఏ విధంగా గుర్తించాలి, అత్యవసర సమయాల్లో పీఎంపీలు చేయాల్సిన ప్రాథమిక చికిత్సల్లో నూతన పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య బృందానికి పీఎంపీలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోన సత్యనారాయణ, సూరంపూడి వీరభద్రరరావు, కోశాధికారి రామచంద్రపురం కార్యదర్శి మట్టా వీరబాబు, కె.గంగవరం మండల అధ్యక్షుడు మేడిశెట్టి రామకృష్ణ, రెండు మండలాల కోశాధికారులు గుబ్బల సత్యనారాయణ, సూదికొండ సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో పీఎంపీలు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను పారదర్శకంగా అందించాలి

కపిలేశ్వరపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పర్యవేక్షణలో పారదర్శకంగా వినియోగదారులకు అందించాలని రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ ఆదేశించారు. నేటి నుంచి ఉచిత విధానం అమలులోకి తెస్తున్న నేపథ్యంలో ఆదివారం కపిలేశ్వరపురంలోని ఇసుక నిల్వలను పరిశీలించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వరదల సమయంలో వినియోగార్థం కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల వద్ద ఇసుక నిల్వలను ఉంచింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ ఇసుక నిల్వలను ఉచిత ఇసుక పరిధిలోకి తీసుకొచ్చి తరలించేందుకు ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని ఇసుక నిల్వలను ఆర్డీఓ సుధాసాగర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను క్షేత్ర స్థాయి అధికారులు, ఉద్యోగులు విధిగా పాటించాలన్నారు. జిల్లా సాండ్ కమిటీ నూతన ఇసుక విధానాన్ని పర్యవేక్షిస్తుందన్నారు. ఇసుక తరలించే ప్రక్రియను పరిశీలించిన అనంతరం రవాణా, లోడింగ్ తదితర చార్జీలను ప్రకటిస్తుందన్నారు. అక్రమాలకు తావిస్తే సంబంధిత అధికారులు, అక్రమార్కులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఆర్అండ్‌బీ డీఈ సూర్యనారాయణ, ద్రాక్షారామ, మండపేట ఏఈఓలు కిశోర్‌కుమార్, ఫణిలింగేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ షాలెంరాజు, వీఆర్వోలు శ్రీనివాసరావు, ప్రసాద్, జాన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మొహర్రం నెల ప్రారంభం

రామచంద్రపురం రూరల్: చంద్ర దర్శనంతో ద్రాక్షారామలో ముస్లిం భక్తులు మొహర్రం సంతాప దినాలను ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ద్రాక్షారామ పరిసరాల్లోని 20 పంజాలను ధర్మకర్తలు సిద్ధం చేశారు. ముస్లిం సోదరులు అధికంగా నివసించే ద్రాక్షారామలో ఆగా వారి పంజా, హజరత్ అబ్బాస్ పంజా, పంజాదానీ పంజా, ఇమామ్ రజా పంజా, ఆజా ఖానీ జహరా పంజా, ఆల్ అబ్బాస్ ఆల్ హుస్సేన్ పంజా, బీబీ సకీనా పంజా, ఆర్ బైన్ పంజా, జన్నతుల్ బఖీ పంజా, అలీ అక్బర్ పంజా, మౌలాలీ పంజా, ఇమామ్ పంజా తదితర పంజాల్లో ఆదివారం రాత్రి నెల వంకను చూసి మొహర్రం సంతాప దినాలుగా పరిగణించి ప్రారంభించారు. ఆగా వారి పంజా నుంచి పీరును వెలంపాలెం, ద్రాక్షారామ వీధులలో ఊరేగించి ఇమామ్ అలిరజా పంజాలో ప్రతిష్టించారు. పంజాను పూలతో అలంకరించి ఫాతీహా ఇచ్చారు. మొహర్రం సంతాప దినాల్లో తాజియా(గుండెలపై కొట్టుకోవడం), ఆలం(పీరు) ఊరేగించడం, సంతాప దినాల్లో ప్రధాన తేదీలైన 12, 13, 15, 16 రోజుల్లో గుండాలు (నిప్పు కణికలపై) నడవడం ప్రధానంగా ఆచరిస్తారు. గుండాలపై హిందువులు కూడా నడచి మత సామరస్యానికి ప్రతీకగా తమ భక్తి ప్రపత్తులు చాటుకుంటారు.

మావుళ్లమ్మను దర్శించిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: మారేడుబాక గ్రామంలో వేంచేసి ఉన్న మావుళ్లమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్య భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్ స్కూల్ అధినేత వల్లూరి చిన్నారావు, జనసేన, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.